క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికులకు ఆసరా పింఛన్ ఇవ్వాలి



రఘునాథపల్లి: భవన నిర్మాణ రంగాల కార్మికులకు ఆసరా పింఛన్ ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కుర్చపల్లిలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఆగస్టు 5, 6 తేదీల్లో గ్రామాల్లో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారంలో కార్మికులు ఐకమత్యంతో ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తోకల రమేష్, విల్సన్, రవీంద్ర, నర్సయ్య, రాజ్‌కుమార్, బాబు, శ్రీకాంత్, సుధాకర్, చింటూ, అనిల్, భాస్కర్, పవన్, శేఖర్, దిలీప్, నిరంజన్, మోహన్, కరుణాకర్, ప్రవీణ్, ఎల్లయ్య, అరవింద్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరీల సందడి



బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాల మసీదుల వద్ద, పలు ప్రధాన కూడళ్లలో పీరీలను నిలబెట్టి సంబురాలను చేసుకున్నారు. ఆదివారం పీరీలను ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో ఊదు పొగలను వేస్తూ గ్రామాల్లో తిప్పుతుంటే మహిళలు నీరాజనం పట్టి కానుకలు సమర్పించారు.

నివాళి

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల అనారోగ్యంతో గొలనకొండ సోమక్క మృతి చెందింది. కాగా, ఆదివారం జరిగిన దశదిన కర్మకు ఎమ్మెల్యే రాజయ్య హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు వట్టిపల్లి సంపత్‌ను పరామర్శించారు. ఎంపీపీ జయశ్రీ, దిశ సభ్యురాలు భాగ్యలక్ష్మితోపాటు నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

జనగామ రూరల్: శామీర్‌పేటకు చెందిన చెట్లపల్లి కొండయ్య, గానుగుపహాడ్‌లోని రైతుకో ఆర్డినేటర్ తల్లి కూకట్ల ఎల్లమ్మ ఆదివారం మృతి చెందారు. కాగా వారి మృతదేహాలకు ఎంపీపీ మేకల కళింగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ శ్రీనివాస్, ఐలయ్య, సిద్దులు, తిరుపతి ఉన్నారు.

పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన పారుపెల్లి కృష్ణ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బొల్లెపల్లి కృష్ణ పార్టీ బృందంతో కలసి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పి.సదయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య శ్రీనివాస్, దాట్ల అశోక్ ఉన్నారు.

'రాజకీయ ఉనికి కోసమే బీజేపీ విమర్శలు'

దేవరుప్పుల: నిత్యం ప్రజాసేవ కోసం పాటుపడే మంత్రి దయాకర్‌రావుపై రాజకీయ ఉనికి కోసం బీజేపీ నాయకుల విమర్శలు తగవని సర్పంచ్ గుర్రం స్రవంతి అన్నారు. ఆదివారం మండలంలోని మాదాపురంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల అసంపూర్తి నిర్మాణాలపై బీజేపీ రాద్ధాంతం చేయడంపై మాట్లాడారు. హైస్కూల్ పక్కనే మంత్రి దయాకర్‌రావు దళితుల ఇళ్ల కోసం స్థలాన్ని కొనిచ్చి కేటాయిస్తే లబ్ధిదారుల ఇష్టానుసారం పాత ఇళ్ల అడుగున కొత్తవాటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. కాంట్రాక్టర్ కారణాల వల్ల పనులు నిలిచిపోతే మండల ప్రజాప్రతినిధుల చొరవతో కొనసాగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇలాంటి తరుణంలో లబ్ధిదారుల్ని పక్కదారి పట్టించే బీజేపీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉపసర్పంచ్ శ్రీధర్, జీపీ కోఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు, నరేష్, క్రాంతి ఉన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

చిల్పూరు: చిల్పూరులో ముప్పారపు మల్లయ్యకు చెందిన రూ.8వేల విలువైన ట్రాక్టర్ బ్యాటరీని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. రోజు మాదిరిగా మల్లయ్య వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్‌తో పొలం దున్ని అక్కడే నిలిపి భోజనానికి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ట్రాక్టర్‌లోని బ్యాటరీ చోరీకి గురైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం 18వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కార్మికులు కళ్లు, నోరు, చెవులు మూసుకుని, చెవిలో పువ్వులు, వంటావార్పుతో నిరసన చేపట్టారు. రఘునాథపల్లిలో సమ్మె చేస్తున్న కార్మికులకు జెడ్పీటీసీ బొల్లం అజయ్ రూ.5 వేలు, ఖిలాషాపూర్ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని వీడి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

\- సాక్షి నెట్‌వర్క్



తరిగొప్పుల: చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న కార్మికులు



రఘునాథపల్లి: వంటావార్పుతో..



స్టేషన్‌ఘన్‌పూర్: నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



దేవరుప్పుల: దీక్షలో కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు వెంకన్న

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతిగృహాలతో పాటు గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం 26 శాతం పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ భరోసా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించడంతో పాటు డైట్ ఛార్జీలను పెంచారన్నారు. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు బొంకూరి మహేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

జనగామ: జనగామలో టీడీపీని ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ అన్నారు. పట్టణంలోని సూర్యాపేటరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న నాలుగు మాసాల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపట్టబోయే కార్యక్రమల షెడ్యూల్‌ను సిద్ధం చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ఎల్లేష్, బెడిదె మైసయ్య, బైరుబాబు, చీకట్ల నవీన్, ఎండి ఇక్బాల్, కలీం, సురుగు సతీష్, సీస శ్రీధర్, గడ్డం కృష్ణ, సిరాజ్, సుద్దాల సురేష్, అన్వేష్, సందీప్, కిషన్, కనకరాజ్, శ్రీనివాస్, అవార్డు అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామిని హరీష్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



దేవరుప్పుల: సాయం అందజేస్తున్న నాయకులు



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న కిరణ్‌కుమార్ గౌడ్

దేవరుప్పుల : మండలంలోని పెద్దమడూరులో ఇటీవల ప్రమాదానికి గురైన పోచంపల్లి యాకయ్య కుటుంబానికి బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో రూ.10 వేల సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరి, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి రాములు, మండల ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్, ఉపసర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సాల్వాపూర్, అక్కరాజుపల్లిలో..

బచ్చన్నపేట/తరిగొప్పుల: మండలంలోని సాల్వాపూర్ గ్రామానికి చెందిన నడిగొట్టు చంద్రయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు నాగపురి కిరణ్‌కుమార్ రూ. 5 వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు తరిగొప్పుల మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన తాటి పోషయ్య పెంకుటిల్లు కూలిపోగా విషయం తెలుసుకున్న కిరణ్‌కుమార్ బాధితుడికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

అనాథ పిల్లలకు..

పాలకుర్తి: మండలంలోని కోతులబాధ గ్రామంలోని అనాథ పిల్లలకు చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. బడుగు శేషుకుమార్ బోన్ కేన్సర్‌తో మృతి చెందారు. ఆయన ఇద్దరు కూతుర్లు సమన్విత, సన్నికలకు రామయ్య ఫౌండేషన్ తరఫున ఆర్థిక సాయం అందించారు. చిక్కుడు రాములు, విష్ణు, నర్సయ్య, ప్రేమకుమార్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెన్నూరులో కట్కమోజు అంజయ్య ఇటీవల మృతి చెందగా.. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.



పాలకుర్తి: కోతులబాధ గ్రామంలో..


దేవరుప్పుల: చిన్నమడూరుకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నాగేందర్ తల్లి మృతి చెందగా.. బాధిత కుటుంబ సభ్యులను రామ్మోహన్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం'

పాలకుర్తి టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాదల లవకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలన్నారు. రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గురుకులాలు, హాస్టళ్లకు నిధులు రాలేదని, భోజనం, మరుగుదొడ్లు వంటి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. వెంటనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, విప్లవ్‌రెడ్డి, విఘ్నేష్, సాయిరాం, సాగర్, పవన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 1990–1991 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 33 ఏళ్ల చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరినొకరు నెమరువేసుకొని ఎంతో ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గవ్వల మల్లేశం, కర్రె వీరయ్య, కూతాటి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించగా పూర్వపు విద్యార్థులు నలభై మంది వరకు పాల్గొన్నారు. దీప్తి ఫంక్షన్ హాల్ యజమాని పోరెడ్డి మల్లారెడ్డి, కేమిడి వీరస్వామి, దేవరకొండ మల్లేశంతోపాటు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇంటింటా భగవద్గీత పఠనంపై ప్రచారం



దేవరుప్పుల: మండలంలోని నీర్మాలలో త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారు రచించినటువంటి త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల పఠన ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేశారు. ఆదివారం ఏపీ తాడిపత్రిలోని శ్రీ కృష్ణమందిర సౌజన్యంతో ప్రతి హిందువు ఇంట్లో అపార జ్ఞాన సంపాదన కలిగిన భగవద్గీత చదివితే జ్ఞానాచరణ సాధ్యమవుతుందన్నారు. భువనగిరి, జనగాం, చేర్యాల ప్రాంత ప్రచార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సింహాచారి సేవలు అభినందనీయం



జనగామ రూరల్: విశ్వబ్రాహ్మణ సమాజానికి దిగోజు నర్సింహాచారి చేసిన సేవలు అభినందనీయమని తెలంగాణ తొలి సభాపతి మధుసూదనాచారి అన్నారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి షష్టిపూర్తి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆశీర్వదించారు. నర్సింహాచారి విశ్వబ్రాహ్మణుల కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. అనంతరం సేవా రంగంలోని ప్రతిభామూర్తులకు 'విశ్వకర్మ తేజోరత్న' పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంబాచారి, జి కృష్ణ, సాయి కిరణ్, సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నర్మెట: దేశం తలదించుకునేలా మహిళలను నగ్న ప్రదర్శనచేసి అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను అదుపు చేయలేని ప్రభుత్వాన్ని వెంటను బర్తరఫ్ చేయాలని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ మహేందర్, మండల అధ్యక్షుడు ధరావత్ రమేష్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా నర్మెట చౌరస్తాలో ఆదివారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం వారు మాట్లాడారు. సాధ్యంకాని ఎన్నికల హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వాలతోనే మణిపూర్ అగ్నిగుండంలా మారిందని, కేంద్రం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. గిరిజనులు, గిజనేతరుల మధ్య దాడులు, హింసలు, మానభంగాలు జరుగుతున్నా ప్రభుత్వాల మొద్దునిద్రతో అమాయక జనం బలవుతున్నారని సిగ్గుచేటన్నారు. జిల్లా మండల నాయకులు బానోత్ రమేష్, మోహన్, అరుణ్, సురేష్, ప్రవీణ్, అర్జున్ రాజేందర్, తరుణ్ తేజ్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నేడు కేటీఆర్ బర్త్‌డే వేడుకలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బర్త్‌డే వేడుకలను పురస్కరించుకుని జనగామ ఆర్టీసీ చౌరస్తాలో నేడు(సోమవారం) నిర్వహించనున్న ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సుల్తాన్‌రాజా, పార్టీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. రక్తదాన శిబిరం, కేక్ కటింగ్, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సుల్తానారాజా తెలిపారు.

'శాంతియుతంగానే పోరు'

జనగామ: పట్టణంలోని సూర్యాపేటరోడ్డు దుర్గా కాలనీకి దారి చూపించే వరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని కాలనీకి చెందిన ప్రతినిధులు కోటిరెడ్డి, ఆలూరు రమేష్, పాషా, చిరంజీవి, అశోక్, లాల్మా నాయక్, వంశీ, మల్లేష్, భాస్కర్ అన్నారు. ఆదివారం 9వ రోజు కాలనీలో చేపట్టిన దీక్షలో మహిళలు, పిల్లలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తాళ్ల సురేష్ రెడ్డిని కలిసి వినతి చేశారు. వారు మాట్లాడుతూ 150 కుటుంబాలు నివసించే కాలనీ దారి మూసి వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చెత్త సేకరణ వాహనంతో పాటు అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తపరిచారు. కాలనీ దారి కోసం చేస్తున్న పోరాటానికి అందరు మద్దతు పలకాలన్నారు.



దీక్షలో కాలనీ మహిళలు, పిల్లలు

డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తుల స్వీకరణ

దేవరుప్పుల: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో కొనసాగుతున్న డ్రైవింగ్ లైసెన్స్‌ల దరఖాస్తులు వెయ్యికి చేరాయి. ఆదివారం బీఆర్‌ఎస్ మండల కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి ఆధ్వర్యంలో పలు గ్రామాల యువత నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మహేష్, ఐలుమల్లు, యూత్ మండల అధ్యక్షుడు నవీన్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

కొడవటూర్‌లో..

బచ్చన్నపేట: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి యువతకు చేయూతను అందిస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పలువురు యువత వద్ద డ్రైవింగ్ లైసెన్స్ ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంత ఖర్చులతో యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇప్పిస్తున్నారని తెలిపారు. వాహనాలు కలిగి ఉన్న యువత ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు షబ్బీర్, నాయకులు శేఖర్‌రెడ్డి, మల్లయ్య, లక్ష్మయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పాలకుర్తి టౌన్: ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా పాలకుర్తి ఓంకారేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రఘుశర్మ సహకారంతో గౌరమ్మ ముందు ఒత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ రాంచంద్ర శర్మ, సూపరింటెండెంటు వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మహిళలు

కెనాల్‌కు గండ్లు.. నీట మునిగిన వరినాట్లు

- పొలాల్లో భారీగా ఇసుక మేటలు
- ఇబ్బందులు పడుతున్న వెంకిర్యాల రైతులు

జనగామ రూరల్: గత మూడు రోజులుగా ఎడతెరపలేని భారీ వర్షాలకు మండలంలోని వెంకిర్యాల–అడవికేశవాపూర్ గ్రామాల మధ్య బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి వచ్చే కెనాల్ కాల్వకు రెండు చోట్ల భారీ గండ్లు ఏర్పడ్డాయి. వరదనీరు వరి పొలాల్లో చేరి 70 ఎకరాలు నీటమునగగా 30 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో 25 మంది రైతులు తీవ్ర నష్టపోయారు. పెద్ద తాళ్ల చెరువు నుంచి వర్షం నీరు కాల్వలోకి తుంగ శుభ్రం చేయకుండా వదలడంతో కాల్వకు 50 మీటర్ల మేర కోత పడింది. అలాగే గ్రామంలోని షేర్ మహమ్మద్ కుంట నీరు వెంకిర్యాల చెరువు మీదుగా గానుగుపహాడ్ వాగులోకి వెళ్లాలి. కానీ గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో కాల్వలోకి నీరు వదలడంతో సిద్దెంకి వెళ్లాల్సిన నీరు అధికారుల నిర్లక్ష్యంతో తుములు సరిగాలేక మళ్లీ వాటర్ వెనక్కి రావడంతో భారీ గండ్లు ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీగా పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వాటిని పొలాలుగా మార్చాలంటే ఎకరానికి రూ.30 వేల ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గానుగుపహాడ్ క్రాస్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో తాత్కాలిక రోడ్డు వేయడంతో భారీ వరద కారణంగా కొట్టుకపోయింది. దీంతో గానుగుపహాడ్ మీదుగా వాహనాలను తరలిస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో భారీ వాహనాలతో రోడ్డు గుంతలమయంగా మారింది. గ్రామం నుంచి వెళ్లే మార్గంలో మరో కల్వర్టు కూడా దెబ్బంతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో ఇసుక మేటలు

అధికారుల నిర్లక్ష్యంతోనే కాల్వకు గండ్లు



వెంకిర్యాలలోని కెనాల్‌కు రెండు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్య, పర్యవేక్షణ లోపం కారణంగా కాల్వ ద్వారా సిద్దెంకి వెళ్లాల్సిన నీరు రివర్స్‌గా వచ్చి తూము వద్ద తుంగతీయక పోవడంతో ఈ ఘటన జరిగింది. తమ పొలంలో భారీగా ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పొలం చేసుకోవాలంటే రూ.30 వేల వరకు ఖర్చువస్తది. తీవ్రంగా నష్టపోయాం.. ప్రభుత్వం ఆదుకోవాలి.

\- తాళ్లపల్లి శివరాం, రైతు, వెంకిర్యాల

పేద విద్యార్థులకు 'కడియం' ఫౌండేషన్ చేయూత



చిల్పూరు: ఆర్థికసాయం అందుకున్న విద్యార్థులతో కడియం శ్రీహరి

చిల్పూరు/జఫర్‌గఢ్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు ఆదివారం కడియం ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేశారు. హనుమకొండలోని కడియం నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన నీరటి ప్రభాకర్ కూతురు సాయిశ్రీ (బీఎస్సీ నర్సింగ్), కూనూరు గ్రామానికి చెందిన ఇల్లందుల భీమయ్య కుమారుడు వంశీ (ఎంబీబీఎస్), రాజవరం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి మనుమరాలు రాసమల్ల కృష్ణవేణి (పాలిటెక్నిక్ డిప్లొమా), క్యాతంపల్లికి చెందిన గంగారపు సంజీవ కూతురు సురక్షిత (ఎంబీబీఎస్)లకు ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కడియం కావ్య, సర్పంచ్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ నర్సింహులు, ఎర్రబెల్లి చేరాలు, బూర్ల శంకర్, సీహెచ్ నరేందర్‌రెడ్డి, నీల గట్టయ్య, సాదం నర్సింహులు, శ్యాంకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

మహిళా సంఘ భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేయాలంటూ మండలంలోని కృష్ణాజీగూడెం మహిళలు ఎంపీటీసీ సాదం నర్సింహులు, సంఘం అధ్యక్షురాలు సాదం శైలజల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కొరిపెల్లి రాజహంస, రైతు కోఆర్డినేటర్ మల్లారెడ్డి, సీఏలు రజిత, మాధవి, మాజీ సర్పంచ్ చేరాలు, సాదం భీమన్న, ఎర్రబెల్లి శ్రీను ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన మీదికొండ ముదిరాజ్ సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలోని అతని నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని మంజూరు చేయాలని వారు కడియంను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారని ముదిరాజ్ సంఘం పెద్దలు తెలిపారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, జిల్లా కార్యదర్శి బూర్ల శంకర్, మీదికొండ మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, కులసంఘం అధ్యక్షుడు గొడుగు సంజీవరాజు, పెద్దమ్మతల్లి గుడి అధ్యక్షుడు చాతరబోయిన మధుసూదన్, శాగ రమేష్, రొయ్యల రవి, గొడుగు రాజయ్య పాల్గొన్నారు.